క్లుప్తంగా

ఉత్సవాలపై సమీక్ష

నూజివీడు: గణపతి ఉత్సవాలకు నూజివీడు డివిజన్‌లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో మంగళవారం పోలీసు, రెవెన్యూ అధికారులతో ఉత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ సందర్శన

నూజివీడు: విద్యార్థులు విద్యతో పాటు జీవనోపాధికి దోహదపడే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ హెచ్ఎం డీవీఎల్ పుష్పలత పేర్కొన్నారు. హైస్కూల్‌లోని 9, 10 తరగతులకు చెందిన ఒకేషనల్ అగ్రికల్చర్ విద్యార్థులు ఒకేషనల్ ఉపాధ్యాయుడు వై.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో ఉన్న ఇంటిగ్రేటెడ్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను సందర్శించారు. ఎరువుల నాణ్యత పరీక్షలు, విత్తనాల నాణ్యత పరీక్షలు తదితర అంశాలను ల్యాబ్‌లోని వ్యవసాయ సహాయకులు విద్యార్థులకు వివరించారు.

ప్రొఫెసర్ రవికుమార్‌కు అవార్డు

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి నిమ్రా ఫార్మసీ కళాశాలలో ఫార్మా కాగ్నసి, ఫైటో కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అవిరినేని రవికుమార్‌కు ఉత్తమ ప్రొఫెసర్ అవార్డు లభించింది. భారతదేశ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదించిన సైంటిఫిక్ లారిల్స్ సంస్థ అవార్డు ప్రదానం చేసింది. చెన్నై ప్రధాన కార్యాలయం నుంచి అవార్డు విషయం ఈ–మెయిల్ ద్వారా అందిందని ప్రొఫెసర్ తెలిపారు. రవికుమార్‌కు నిమ్రా విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ తమ్మినేని నారాయణమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జనార్దన్, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

తిరువూరు: హైదరాబాద్ కోట్ల విజయభాస్కర రెడ్డి స్టేడియంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తిరువూరు రేవంత్ డిఫెన్స్ స్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించారు. కటా విభాగంలో గీత సహస్ర, దుహితసాయి, నాన్సీ, ధన్యశ్రీ, జ్యోత్స్న బంగారు పతకాలు, కుమిటి విభాగలో జేసీశ్రీ, శాశ్వత్య, కాశీ విశ్వనాథ్ బంగారు పతకాలు, రోహిత్‌పునీత్, నిఖిల్‌సాయిలు వెండి పతకాలు సాధించారని కోచ్ రేవంత్ తెలిపారు.

నానో యూరియాతో మేలు

ఆగిరిపల్లి: నానో యూరియా వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి జె.భవాని అన్నారు. మండలంలోని చిన్నఆగిరిపల్లిలో నానో యూరియా, నానో డీఏపీ వాడడం వల్ల కలిగే ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సంప్రదాయ యూరియాను తగ్గించి నానో యూరియా అధికంగా వాడాలని సూచించారు. సర్పంచ్ పల్లగాని జమదగ్ని, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెండాకు అవార్డు

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ మెండా దేవానంద్ కుమార్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. దేవానందకుమార్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, అధ్యాపకులు అభినందించారు.

వేతనాలు పెంచాలి

మైలవరం: కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన వేతనాల పెంపు హామీని అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా మహాసభలు మంగళవారం మైలవరంలో నిర్వహించారు. యూనియన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలని, సెలవులు మంజూరు చేయాలని, దహన సంస్కారాల ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చవితి సందడి

తిరువూరులో విక్రయానికి సిద్ధం చేసిన గణపతి విగ్రహాలు



నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న ప్రజలు



గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తిరువూరు, నూజివీడు, మైలవరం నియోజకవర్గాల్లో నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. పలు చోట్ల పందిళ్లు వేసి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. పత్రి కొనుగోలు దారులతో పలు సెంటర్లు కిక్కిరిశాయి. పూలు, పూజ సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. చవితి వేడుకల నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. మట్టి ప్రతిమలను పూజించాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పర్యావరణ ప్రియులు పేర్కొంటూ పలుచోట్ల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.

–తిరువూరు/నూజివీడు/మైలవరం



తిరువూరు మండలం మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతి ప్రతిమలు



నూజివీడు పండ్ల మార్కెట్ సెంటర్ వద్ద విక్రయానికి సిద్ధంగా ..



చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పూజ సామగ్రి దుకాణాలు

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

నూజివీడు: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను ఉపయోగించాలని నూజివీడు రోటరీ క్లబ్ అధ్యక్షులు సజ్జా శశికాంత్ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. సెక్రటరీ మండా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

- మైలవరం: వినాయక చవితి సందర్భంగా పూజా కార్యక్రమంలో మట్టి గణపతి ప్రతిమలు వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో శ్రీరేణుక ఎల్లమ్మ త్రిశక్తి పీఠం తరఫున శ్రీరామలింగం స్వామి (అమ్మ) సౌజన్యంతో మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ ఎస్ విభాగం, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో మైలవరం సెంటర్‌లో 1000 వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు.
- కొండపల్లి(ఇబ్రహీంపట్నం): స్థానిక క్రాంతి హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన మట్టి ప్రతిమలను పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. క్రాంతి హైస్కూల్ కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.
- నరసాపురం(విస్సన్నపేట): నరసాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మట్టి గణపతి ప్రతిమలను తయారు చేసి గ్రామస్తులకు అందజేశారు. పాఠశాల హెచ్ఎం శోభాలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- తిరువూరు: స్థానిక బోస్ సెంటర్‌లో లయన్స్, సమత, లెజెండ్ క్లబ్బుల ఆధ్వర్యంలో మంగళవారం మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. తిరువూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చలమాల శంకరరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.
- ఆగిరిపల్లి: మట్టి వినాయకుని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఈదర జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని శారద సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మట్టి వినాయకుడిని పూజించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు .

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి

నూజివీడు: మదర్ థెరిస్సా జయంతిని మండలంలోని మద్దాయికుంట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సా చిత్రపటానికి హెచ్ఎం దారపురెడ్డి భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మదర్ థెరిస్సా సేవలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు యు.శివనాగరాజు, బి.జాన్సన్, పాగోలు నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

- మైలవరం: మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమం మైలవరంలో మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. థెరిస్సా విగ్రహానికి నివాళులర్పించారు. ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ మాట్లాడుతూ మదర్ థెరిస్సా సేవలను కొనియాడారు. వంగూరు రమేష్‌బాబు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.
- తిరువూరు: పేదలపై దయతో సేవలందించిన మదర్ థెరిస్సా నేటికీ అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నారని తిరువూరు ఐడియాస్ సేవా సంస్థ డైరెక్టర్ అవ్వారి శౌరి అన్నారు. ఐడియాస్ సేవా సంస్థలో మదర్ థెరిస్సా జయంతిని నిర్వహించారు. మదర్ థెరిస్సా చేసిన సేవలకు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్నారని వివరించారు. థెరిస్సా చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దివ్యాంగ బాలలకు ఫిజియోథెరపి

మునునూరు: సమగ్ర శిక్షా అభియాన్ మండల విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులు, వారి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను హెచ్ఎం భాస్కరరావు వివరించారు. అనంతరం ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియో థెరపీ నిర్వహించారు. ఉపాధ్యాయుడు సురేష్, ఐఈఆర్ టీచర్లు పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సులతో ఉపాధి

మైలవరం: వృత్తి విద్య కోర్సులతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల–ప్లస్ హెచ్ఎం రాజశేఖర్ అన్నారు. బ్యూటీ కోర్సు, వెల్నెస్ కోర్సులను ప్రవేశపెట్టామని చెప్పారు. ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం సెలూన్‌లో ఉపయోగించే అడ్వాన్స్ ట్రీట్‌మెంట్‌పై అవగాహన కల్పించేందుకు 9,10, ఇంటర్ తరగతుల విద్యార్థులను లక్ష్మీ ప్రసన్న బ్యూటీ సెలూన్‌కు ఇండస్ట్రియల్ విజిట్‌కు తీసుకువెళ్లారు. ఉపాధ్యాయుడు తిరుమల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి చూపాలని ఆటో డ్రైవర్ల ధర్నా

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడంతో తాము జీవనోపాధి కోల్పోయామని, తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని కోరుతూ తిరువూరులో ఆటో డ్రైవర్లు మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. స్థానిక బైపాస్ రోడ్డు జంక్షన్ నుంచి ఫ్యాక్టరీ సెంటర్, బోస్ సెంటర్, పాత బస్టాండ్ మీదుగా తహసీల్దారు కార్యాలయం వరకు ఆటోలతో ప్రదర్శన సాగింది. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని, ఎన్నికలకు ముందు సాధికార సంస్థ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, వాహనమిత్ర పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం తిరువూరు తహసీల్దారు ఉదయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు బి. వెంకటేశ్వరరావు, ఎస్‌వీ భద్రం, ఎ. రవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

విస్సన్నపేట: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న నవరాత్రి పందిళ్ల వద్ద నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలు పాటించాలని ఎస్ఐ జి. రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గణేష్ నవరాత్రి పందిళ్ల నిర్వాహకులకు నియమ నిబంధనలను వివరించారు. డిప్యూటీ ఎంపీడీఓ శివకుమార్, అగ్నిమాపక అధికారి భరత్‌భూషణ్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ఆగిరిపల్లి: క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నూజివీడు టీబీ యూనిట్ సూపర్‌వైజర్ జగన్‌మోహన్ అన్నారు. మంగళవారం స్థానిక కొండ కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు క్షయ వ్యాధి– తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు శ్యాం సుందర్, ల్యాబ్ టెక్నీషియన్ బొబ్బర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండ పోరంబోకు స్థలం ఆక్రమణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో కొండ పోరంబోకు స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించి సుమారు అరెకరం స్థలానికి ఓవైపు ప్రహరీ నిర్మించి లేఅవుట్ వేసి అమ్మేశారు. విషయం ఆలస్యంగా వెలుగు చూడటంతో ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ మౌస్మి, పలువురు వార్డు కౌన్సిలర్లు ఆక్రమిత స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు.

ఎమ్మార్పీఎస్ మైలవరం ఇన్‌చార్జిగా కృష్ణ

మైలవరం: ఎమ్మార్పీఎస్ మైలవరం మండలం ఇన్‌చార్జిగా మోదుగు కృష్ణ నియమితులయ్యారని జిల్లా అధ్యక్షుడు ఆలూరు నాగమల్లేశ్వరరావు తెలిపారు. మైలవరం ఆర్ అండ్ బీ అతిథిగృహంలో మంగళవారం జరిగిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ కమిటీలు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కొంగల రామారావు, జమలయ్య పాల్గొన్నారు.